మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ జన్మదిన వేడుకలు


కోదాడ : రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కోదాడ/మోతె ఆగస్టు 14 : మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ జన్మదిన వేడుకలను బుధవారం కోదాడ పట్టణం, మోతె మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కోదాడలో మాజీ ఎంపీపీ కవిత, టీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్, కర్ల సుందర్‌బాబు, కాసాని మల్లయ్యగౌడ్, మాదాల ఉపేందర్, గంధం మల్లయ్య, సంగిశెట్టి గోపాల్, సుంకర అభినాయుడు , పాల్గొనగా.. మోతెలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శీలం సైదులుయాదవ్, జిల్లా నాయకులు ఏలూరి వెంకటేశ్వర్‌రావు మధుసూదన్‌రెడ్డి, నాయకులు గుగులోతు శంకరనాయక్, పర్సు మల్సూర్‌గౌడ్, రవిగౌడ్, ముత్తయ్య, గంగులు, దేవుల జెంజిరాల సుధాకర్, భిక్షం పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుపై ఆర్డీఓ విచారణ

రావిపహాడ్ రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

పాలకవీడు, ఆగస్టు 14 : మండలంలోని కల్మటితండా గ్రామానికి చెందిన వడిత్యా సుధాకర్, జాన్‌పహాడ్ దర్గాకు చెందిన స్వామి అనే రైతులు రావిపహాడ్ గ్రామశివారు పరిధిలో తమ పంట పొలాల్లో దక్కన్ సిమెంట్ బ్లాస్టింగ్ సమయంలో బండ రాళ్లు పడుతున్నాయని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో కలిసి బుధవారం క్షేత్రస్థాయి పరిశీలించినట్లు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఏడీఈ రామరాజు, ఇన్‌చార్జి తాసీల్దార్ కమలాకర్, అటవీ సెక్షన్ అధికారి మల్లేశ్, డివిజన్ సర్వేయర్ వంశీధర్ ఉన్నారు.

బియ్యం గింజపై జాతీయ జెండా



సైదులు

కోదాడ, ఆగస్టు 14 : పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు తమల పాకుల సైదులు బియ్యం గింజపై నాలుగు మిల్లీమీటర్ల ఎత్తు గల జాతీయ జెండాను ఆవిష్కరించాడు. గతంలో ఈయన ఆవ గింజ, నువ్వుల గింజపై జాతీయ జెండాతో పాటు 51 బియ్యపు గింజలపై జాతీయ గీతాన్ని పొందుపర్చి పలువురి ప్రశంసలు పొందారు.

దేశభక్తి పెంపొందించడమే ఐవీఓ లక్ష్యం : రవీందర్‌రావు

కోదాడటౌన్, ఆగస్టు 14 : అందరిలో దేశభక్తి పెంపొందించడమే ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్ లక్ష్యం అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉజ్జిని రవీందర్‌రావు అన్నారు. కోదాడ పట్టణంలోని వాయిలింగారం రోడ్డులో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వంద అడుగుల జాతీయ జెండా నిర్మాణ పనులు పూర్తయిన సందర్భంగా ఐవీఓ జిల్లా అధ్యక్షుడు, స్టేట్ కోఆర్డినేటర్ గుండా మధుసుదన్‌రావు, ఇతర సభ్యులతో కలిసి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గుండపునేని నాగేశ్వర్‌రావు, జగని ప్రసాద్, జగని ప్రసాద్ పాల్గొన్నారు.

భార్యను చంపిన భర్త

సూర్యాపేట టౌన్, ఆగస్టు 14 : జిల్లా కేంద్రంలోని శ్రీరామ్‌నగర్‌లో బుధవారం భార్యను భర్త హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు గ్రామానికి చెందిన దాసోజు బ్రహ్మచారి డోర్ పాలిష్ వర్క్ చేస్తుంటాడు. అతడి భార్య సరిత(31) ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తుంటుంది. వీరు పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. గత కొద్దిరోజులుగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండగా బ్రహ్మచారి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం 6 గంటల సమయంలో బ్రహ్మచారి భార్యతో గొడవకు దిగాడు. మాటా మాటా పెరుగడంతో కోపోద్రిక్తుడైన బ్రహ్మచారి ఇంట్లో ఉన్న జే వైర్‌ను భార్య మెడకు చుట్టి బలంగా లాగడంతో ఊపిరి ఆడక సరిత మృతి చెందింది. సరిత తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అర్వపల్లి, ఆగస్టు 14 : మండల పరిధిలో ని వేల్పుచర్ల స్టేజీ సమీపంలో బుధవారం రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందినది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అడివెంల గ్రామానికి చెందిన గోల్కొండ లక్ష్మి(65), భర్త బాలనర్సయ్యతో కలిసి బైక్‌పై వ్యక్తిగత పని నిమిత్తం అర్వపల్లికి వచ్చారు. తిరిగి గ్రామానికి వెళ్తుండగా వేల్పుచర్ల స్టేజీ వద్ద ఎన్‌హెచ్-365బీ జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి రాయి ఎక్క గా ఇద్దరు కింద పడిపోయారు. ఈ ఘటనలో లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా.. భర్తకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమి త్తం బాలనర్సయ్యను సూర్యాపేట ఏరియా దవాఖానాకు తరలించారు. కుమారుడి ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

డ్రగ్స్‌రహిత తెలంగాణ కోసం పాటుపడాలి

● జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

చిట్యాల: డ్రగ్స్ నియంత్రణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

చిట్యాల, ఆగస్టు 14 : డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని గుండ్రాంపల్లికి చెందిన విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గాదె వినోదరెడ్డి, ఫౌండేషన్ల చైర్మన్లు అనుముల శ్రీనివాసు, మొత్కూరు శ్రీనివాస్, డాక్టర్ తోట నర్సింహాచారి, బూరుగు గోపీ కృష్ణ, కూరెళ్ల నర్సింహులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషిచేయాలి

రామగిరి : మాదక ద్రవ్యాల నియంత్రణకు అందరూ కృషి చేయాలని జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నల్లగొండలోని డైట్ సమావేశ మందిరంలో బుధవారం పాఠశాల విద్యార్థులకు 'మాదక ద్రవ్యాల నియంత్రణ' అనే అంశంపై జిల్లాస్థాయి పోటీలను నిర్వహించారు. మండలాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఉపన్యాస, వ్యాసరచన, పాటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా స్వాతంత్ర్య వేడుకల్లో కలెక్టర్ నారాయణరెడ్డి బహుమతులు అందజేస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాదక ద్రవ్యాల నియంత్రణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయు లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

పాటల పోటీల్లో .. ప్రథమ టి.హేమశ్రీ 9వతరగతి ప్రభుత్వ బాలిక పాఠశాల ఆర్‌పీ రోడ్డు నల్లగొండ, ద్వితీయ జె.పవన్ 7వతరగతి జడ్పీ, హైస్కూల్ వీటీనగర్(మాల్) , తృతీయ బహుమతి కె.సిద్ధిత 10వతరగతి, జడ్పీ హైస్కూల్ ఎల్లారెడ్డి గూడెం

వ్యాసరచన పోటీల్లో ..ప్రథమ టి.సాదృశ్య 10వ తరగతి జడ్పీ హైస్కూల్, పాల్వాయి గుర్రంపోడు, ద్వితీయ బహుమతి వై. భార్గవి 10వ తరగతి, జడ్పీ హైస్కూల్, కట్టంగూర్ , తృతీయ టి.రాధిక 10వ తరగతి మోడల్ స్కూల్ వల్లాల, శాలిగౌరారం

ఉపన్యాస పోటీల్లో .. ప్రథమం బి.స్పందన 10వ తరగతి, జడ్పీ హైస్కూల్, కొండమల్లేపల్లి, ద్వితీయం కె.సురేశ్ 10వతరగతి డైట్ పాఠశాల నల్లగొండ, తృతీయం ఎన్.హన్సిక 10వతరగతి, గాంధీ హైస్కూల్ చండూర్, నల్లగొండ

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మిర్యాలగూడ : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని షీటీమ్ ఎస్ఐ కోటే శ్ అన్నారు. మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో షీటీమ్ సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం : మండల కేంద్రంలోని గీతాంజలి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వద్దకు ర్యాలీ నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ సైదులు, కరస్పాండెంట్ పరమేశ్‌రావు. ప్రభంజనం పాల్గొన్నారు.

శాలిగౌరారం : ర్యాలీలో పాల్గొన్న ఎస్ఐ, విద్యార్థులు

తరగతి గదుల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి

● డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి

నకిరేకల్ : జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మాణ పనుల వివరాలు తెలుసుకుంటున్న డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి

నకిరేకల్, ఆగస్టు 14 : జడ్పీ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను డీఆర్డీఓ ఎర్రబెల్లి శేఖర్‌రెడ్డి ఆదేశించారు. నకిరేకల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు, టాయిలెట్స్ నిర్మాణ పనులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అనంతరం అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి. బాలయ్య, డీఈ కొండయ్య, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ నాగయ్య, ఐకేపీ ఏపీఎం నరహరి, ఏపీఓ రమణయ్య, ఏఈ సంపత్, సీసీ కొండ మట్టయ్య, హెచ్ఎం రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పోస్టల్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామగిరి, ఆగస్టు 14: తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆశాఖ అధికారి నర్సింహ, ఎస్పీఎం రమాదేవి కోరారు. నల్లగొండలోని ఎస్ఎల్‌బీసీ పోస్టాఫీసులో బుధవారం ప్రజలకు పోస్టల్ పొదుపు పథకాలైన రికరింగ్ డిపాజిట్, సుకన్య సమృద్ధి యోజన, సేవింగ్, పీపీఎఫ్, గ్రామీణ తపాలా జీవిత బీమా వంటి వాటి ఉపయోగాలను వివరించారు. అందరూ పోస్టాఫీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తపాలా అధికారులు, సిబ్బంది శ్రీకాంత్, బుచ్చిరెడ్డి, రమేశ్, ఎస్‌డీ. కుర్షీద్, రజనీకాంత్, సంతోష్, మహేశ్వరి, వెంకన్న పాల్గొన్నారు.

మినీ జాబ్ మేళాకు అపూర్వ స్పందన

● 22 మంది ఉద్యోగాలకు ఎంపిక

జాబ్‌మేళాలో పాల్గొన్న కంపెనీ ప్రతినిధులు

నల్లగొండ రూరల్, ఆగస్టు 14: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మినీ జాబ్ మేళాకు ఆపూర్వ స్పందన లభించిందని జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ సామ మాధవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేళాకు ఐదు ప్రముఖ కంపెనీలు పాల్గొనగా 117 మంది అభ్యర్థులు హాజరైనట్లు వివరించారు. వీరిలో 56 మంది ప్రాథమిక ఎంపికకగా కేఎల్ గ్రూప్ -9 ,అన్నపూర్ణ ఫైనాన్స్ లిమిటెడ్-2, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ - 3, వెస్టీజ్ -8 సంస్థల్లో మొత్తం 22 మంది ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు

కృష్ణవేణి స్కూల్‌లో బోనాలు

నకిరేకల్ : గ్రామదేవతలకు బోనం సమర్పించేందుకు వివిధ వేషధారణలో వెళ్తున్న విద్యార్థులు

త్రిపురారం: బోనాలతో వెళ్తున్న మహిళలు

నకిరేకల్, ఆగస్టు 14 : పట్టణంలోని కృష్ణవేణి హైస్కూల్‌లో బుధవారం బోనాల పండుగ నిర్వహించుకున్నారు. స్కూల్ యాజమాన్యం గ్రామదేవతలకు బోనాలు సమర్పించడం ఐదేండ్లగా ఆనవాయితీగా వస్తుందని నిర్వాహకులు తెలిపారు. కాళికామాతకు బోనాలు సమర్పించారు. కార్యక్రమాల్లో కృష్ణవేణి హై స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు బోనాలు

త్రిపురారం : మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో బుధవారం రాత్రి గ్రామ దేవతలకు మహిళలు బోనాలు సమర్పించారు.

విద్యార్థులకు షూ పంపిణీ

చిట్యాల, ఆగస్టు 14: మండలంలోని వట్టిమర్తి ప్రథమిక పాఠశాలలో పూర్వ విద్యార్థులు సీఐ బూరుగు శ్రీనివాస్, నర్రా కిశోర్ రెడ్డి పాఠశాలలో విద్యార్థులకు రూ.30 వేల విలువైన షూ, టై, బెల్టులు, ఐడీ కార్డులను అందజేశారు. పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అలాగే పూర్వ విద్యార్థి సీఐ బూరుగు శ్రీనివాసు జడ్పీహెచ్ఎస్ షూ, సాక్స్‌లను, పాఠశాల ఉపాధ్యాయులు సూర్యప్రకాశ్, శీలం మధుసూదన్ టై, బెల్టులను అందజేశారు.

అనుమానితులను అదుపులోకి తీసుకోవాలి :డీఎస్పీ

నీలగిరి, ఆగస్టు 14 : నల్లగొండ పట్టణంలో అనుమానాస్పందంగా కనబడిన వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలని నల్లగొండ డీఎస్పీ కొలను శివరాం రెడ్డి అన్నారు. స్థానిక ఎన్‌జీ కళాశాల సమీపంలో బుధవారంఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తలో భాగంగా తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. నల్లగొండ టూటౌన్ సీఐ డానియల్ కుమార్, మహిళ ఎస్ఐ విజయబాయి సిబ్బంది ఉన్నారు.

నకిరేకల్ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా ఉమారాణి

ఉమారాణి

నకిరేకల్, ఆగస్టు 14 : నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌పై 16 మంది కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో చైర్మన్ పదవీ ఖాళీ అయింది. దాంతో నూతన మున్సిపల్ చైర్మన్ ఎన్నిక అయ్యేంత వరకూ ప్రస్తుతమున్న వైస్ చైర్మన్ మురారిశెట్టి ఉమారాణీకృష్ణమూర్తిని ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమిస్తూ కలెక్టర్ నారాయణరెడ్డి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అధికారికంగా ఆమె గు రువారం ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంది.

ముత్యాలమ్మ విగ్రహ ఊరేగింపు

శాలిగౌరారం, ఆగస్టు 14: మండల కేంద్రమైన మార్కెట్ కాలనీలో ప్రతిష్ఠించనున్న ముత్యాలమ్మ విగ్రహాన్ని మంగళవారం స్థానిక మార్కెట్ కాలనీలో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి నీళ్లు ఆరబోసి కొబ్బరికాయలు సమర్పించుకున్నారు. అనంతరం గ్రామ శివారులోని ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విగ్రహదాత బొడ్డు నగేశ్, చామల మహేందర్‌రెడ్డి, కల్లూరి నాగరాజు గౌడ్, సైదులు, సోమయ్య, మహేశ్, సురేశ్, నాగరాజు పాల్గొన్నారు.

సెమీ రెసిడెన్షియల్ నిర్మాణ పనుల పరిశీలన

మునుగోడు,ఆగస్టు14: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సెమీ రెసిడెన్షియల్ నిర్మాణ పనులను ప్రత్యేకాధికారి ఏడీ శ్రీనువాస్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కత్తుల రవీందర్, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వట్టిమర్తి మాజీ సర్పంచ్ రామచంద్రం మృతి

చిట్యాల, ఆగస్టు 14 : మండలంలోని వట్టిమర్తి మాజీ సర్పంచ్, సీపీఎం నాయకుడు రాచమళ్ల రామచంద్రం అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. వట్టిమర్తి గ్రామానికి మొదటి సర్పంచ్‌గా నర్రా రాఘవరెడ్డి పనిచేసిన తర్వాత 28 ఏండ్ల పాటు రామచంద్రం సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా పనిచేశారు.

హైవేపై చోరీ

నకిరేకల్, ఆగస్టు 14 : నకిరేకల్ పట్టణశివారులో బుధవారం రాత్రి హైదరాబాద్-విజయవాడ హైవేపై గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కేతేపల్లి మండలం గుడివాడ గ్రామానికి చెందిన మర్రి శ్రీను, మౌనిక దంపతులు కొంత కాలంగా సూర్యాపేటలో నివాసం ఉంటున్నారు. పని నిమి త్తం భార్యభర్తలిద్దరూ స్కూటీకి నార్కట్‌పల్లికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. నకిరేకల్ శివారులోకి రాగానే పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు మౌనిక చేతిలో ఉన్న బ్యాగు ను లాక్కెళ్లారు. వారూ తేరుకుని చూసేసరికి దొంగలు పారిపోయినట్లు తెలిపారు. బాధితుడు శ్రీను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడికి నిరసనగా ర్యాలీ

కట్టంగూర్, ఆగస్టు 14 :బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కట్టంగూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హిందువులను రక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పబ్బు వెంకన్న గౌడ్, గున్నాల నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ

పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్

అర్వపల్లి, ఆగస్టు 14 : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ డ్రంకెన్ డ్రైవ్‌ను అరికట్టి రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ రవి, సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ బాలకృష్ణ ఉన్నారు.

జర్నలిస్టు చంద్రశేఖర్‌కు నివాళి

చంద్రశేఖర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

నూతనకల్, ఆగస్టు 14 : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నమస్తే తెలంగాణ ఆత్మకూర్(ఎస్) మండల విలేకరి బోయిళ్ల చంద్రశేఖర్‌కు బుధవారం జర్నలిస్టులు నూతనకల్‌లో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నమస్తే తెలంగాణ జిల్లా స్టాఫర్ గుండా శ్రీనువాస్‌గుప్తా, విలేకరులు జలగం మల్లేశ్, ముప్పాని వెంకట నర్సింహారెడ్డి, సతీశ్, శ్రవణ్, ఉపేందర్, సుధీర్, తదితరులున్నారు.

గుండ్లపల్లి లిఫ్ట్ ప్రారంభం

లిఫ్ట్ ప్రారంభిస్తున్న డీఈ భిక్షం

మఠంపల్లి, ఆగస్టు 14 : ఎగువన కురుస్తున్న వర్షాలకు రిజర్వాయర్లన్నీ నిండుకుండల్లా ఉండడంతో మండలంలోని గుండ్లపల్లి లిఫ్ట్‌ను ఇరిగేషన్ డీఈ భిక్షం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచనతో లిఫ్ట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. దీని ద్వారా గుండ్లపల్లి, రఘునాథపాలెం, మఠంపల్లి, పెదవీడు, చౌటపల్లి, ఎర్రగడ్డతండా, మేళ్ల చెర్వు తదితర ప్రాంతాల్లోని 7100 ఎకరాలకు నీరందుతుందని తెలిపారు. లిఫ్ట్ ప్రారంభించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన వెంట ఏఈ శ్రీనివాస్, భద్రారెడ్డి, రైతులు, సిబ్బంది ఉన్నారు.

ఫీడర్ చానళ్లు లేక ఎండిపోయిన చెరువులు

నీరు లేక ఎండిపోయిన కందిబండ ఊరచెరువు

మేళ్లచెర్వు, ఆగస్టు 14 : మండల పరిధిలోని కందిబండ చెరువులకు ఫీడర్ చానళ్లు లేక అడుగంటిపోయాయి. చెరువులను నింపడానికి సాగర్ నీటిని విడుదల చేసినా ఫీడర్ చానళ్లు లేకపోవడంతో ఈ చెరువులకు నీళ్లు రాలేదు. దీంతో పూర్తిగా ఎండిపోయి భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కందిబండలో రెండు చెరువులుండగా ఊరచెరువు విస్తీర్ణం 48 ఎకరాలు కాగా దీని కింద 600 ఎకరాల ఆయకట్టు ఉంది. రెడ్లచెరువు విస్తీర్ణం 13 ఎకరాలు కాగా 200 ఎకరా ఆయకట్టు ఉంది. రామాపురం మైనర్ కాల్వ నుంచి ఊరచెరువుకు, ముక్త్యాల మైనర్ కాల్వ నుంచి రెడ్ల చెరువుకు ఫీడర్ చానళ్లు నిర్మించి చెరువులను నింపాలని రైతులు కోరుతున్నారు.

జాన్‌పహాడ్ మేజర్ ఆర్-11కు గండి

ఎల్లాపురం గ్రామ శివారులో జాన్‌పహాడ్ మేజర్ పరిధి ఆర్-11 కాల్వకు పెట్టిన గండి

పాలకవీడు, ఆగస్టు 14 : మండలంలోని ఎల్లాపురం గ్రామ శివారులో జాన్‌పహాడ్ మేజర్ పరిధి ఆర్-11 కాల్వకు కొందరు గండిపెట్టారని గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. చెరువుకు నీటిని తరిస్తున్నామనే పేరుతో కొందరు రైతులు అనుమతులు లేకుండా గండి కొట్టి తమ పొలాలకు నీటిని పారించుకుంటున్నా ఎన్ఎస్పీ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గండి పెట్టడం వల్ల చివరి భూములకు సాగర్ నీరు అందడం లేదని, నాట్లు పెట్టిన పొలాలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందంటున్నారు. ఎన్ఎస్పీ అధికారులు స్పందించి గండిని పూడ్చివేసి చివరి భూములకు నీరందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలి

ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్, సీపీఐ, బీఎస్పీ నాయకులు

నేరేడుచర్ల, ఆగస్టు 14 : దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి. ధనుంజయనాయుడు, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్‌కుమార్, బీఎస్పీ నాయకుడు కర్రి సతీశ్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతూ ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డికి బుధవారం వినతి పత్రం అందించి మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ. లక్ష్మి, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, బీఎస్పీ నాయకుడు నాగార్జున, సామాజిక ఉద్యమకారుడు ఇంతియాజ్, రైతు సంఘం నాయకులు కటికోల వెంకన్న, బొల్లం అశోక తదితరులు ఉన్నారు.

అధికారులకు నెమలి అప్పగింత

● అస్వస్థతతో మార్గ మధ్యంలోనే మృతి

అటవీ శాఖ అధికారులకు నెమలిని అప్పగిస్తున్న రైతు

నేరేడుచర్ల, ఆగస్టు 14 : గరిడేపల్లి మండలంలో వ్యవసాయ క్షేత్రంలో అస్వస్థతతో పడి ఉన్న నెమలిని బుధవారం ఓ రైతు అటవీ అధికారులకు అప్పగించాడు. పారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచవారిగూడెం గ్రామానికి చెందిన రైతు తంగెళ్ల లక్ష్మయ్య తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లగా పొలంలో అస్వస్థతతో నెమలి పడి ఉండడం గమనించి వెంటనే అటవీ అధికారులకు ఫోన్ చేసి అప్పగించాడు. నెమలిని తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందిందని ఆయన పేర్కొన్నారు. పశు వైద్యాధికారితో పంచనామా చేయించగా మందు కలిపిన వడ్లు తిని మృతి చెందినట్లు తెలిపారు. ఆయన వెంట బీట్ ఆఫీసర్ ప్రతాప్‌రెడ్డి